ఘనంగా రాజ్యాంగ దినోత్సవం

హైదరాబాద్ సిటీ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం పలు ప్రాంతాల్లో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఖైరతాబాద్‌లోని వాటర్ బోర్డు ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన రాజ్యాంగ దినోత్సవ కార్యక్రమానికి ఎండీ అశోక్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా రాజ్యాంగ ప్రవేశికను చదివి ఆయన ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డైరెక్టర్ వీఎల్.ప్రవీణ్ కుమార్, రవికుమార్, సీజీఎంలు మహమ్మాద్ అబ్దుల్ ఖాదర్, కేదారేశ్వరి, రవీందర్ రెడ్డి, ఇతర అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

బంజారాహిల్స్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఫిలింనగర్ చౌరస్తాలోని మహనీయుల విగ్రహానికి పలువురు నివాళులర్పించారు. ఫిలింనగర్ 18 బస్తీ అధ్యక్షుడు మామిడి నర్సింగరావు, కాంగ్రెస్ నాయకులు కాటూరి రమేష్, నగేష్‌సాగర్ తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఎల్లారెడ్డిగూడలో బీఎస్పీ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో ఆ పార్టీ జిల్లా ఇన్‌చార్జ్ దోరపల్లి రమేష్, అధ్యక్షుడు బండారి శ్రీనివాస్, జూబ్లీహిల్స్ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

బోరబండ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని బోరబండలో అంబేడ్కర్ చిత్రపటానికి ఎస్సీ వర్గీకరణ పోరాట సమితి నాయకులు పవనం శివశంకర్, జైభీమ్ యాదగిరి, సత్యనారాయణ, మోహన్, హుస్సేన్, సుమన్ నివాళులర్పించారు.


ఫిలింనగర్ జ్ఞానీజైల్‌సింగ్ నగర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే వివేక్, ఎమ్మెల్సీ ఎంఎస్ ప్రభాకర్, మాల వెలుగు సంఘం రాష్ట్ర కార్యదర్శి దండు లక్ష్మణ్ తదితరులు


వాటర్ బోర్డు కార్యాలయంలో ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎండీ అశోక్‌రెడ్డి


మహనీయుల విగ్రహాలకు నివాళులర్పిస్తున్న ఫిలింనగర్ 18 బస్తీ అధ్యక్షుడు మామిడి నర్సింగ్‌రావు, కాంగ్రెస్ నాయకులు కాటూరి రమేష్, నగేష్‌సాగర్ తదితరులు


నివాళులర్పిస్తున్న బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్ దోరపల్లి రమేష్, అధ్యక్షుడు బండారి శ్రీనివాస్, జూబ్లీహిల్స్ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు


ఖైరతాబాద్ మింట్ కాంపౌండ్ ప్రధాన కార్యాలయంలో ప్రతిజ్ఞ చేస్తున్న దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సీఎండీ ముషారఫ్ ఫారూఖీ, సంస్థ డైరెక్టర్లు నందకుమార్, సాయిబాబా, నర్సింహులు, సుధామాధురి



సైదాబాద్‌లోని సింగరేణి ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన భారత రాజ్యాంగ దినోత్సవంలో పాల్గొన్న జనరల్ మేనేజర్ డి.ఎం.సుభాని తదితరులు

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పంజాగుట్ట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మరమ్మతుల కారణంగా బంజారాహిల్స్ ఏడీఈ పరిధిలోని పలు ప్రాంతాల్లో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ జి.గోపి తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు క్యాన్సర్ ఆస్పత్రి, కమలాపురి కాలనీ ఫీడర్ల పరిధిలోని బంజారాహిల్స్ రోడ్ నంబర్ 10, ఆదాయపన్ను శాఖ క్వార్టర్స్, ఐఏఎస్ క్వార్టర్స్, క్యాన్సర్ ఆస్పత్రి, సత్యసాయి కల్యాణ మండపం, కమలాపురి కాలనీ, తన్వీర్ ఆస్పత్రి ప్రాంతాల్లో.. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 వరకు సినీ ఘర్, కమ్మ సంఘం ఫీడర్ల పరిధిలోని ఒమేగా ఆస్పత్రి, నాగార్జున నగర్, విజయ టవర్స్ ప్రాంతాల్లో కరెంట్ సరఫరా ఉండదని ఏడీఈ పేర్కొన్నారు.

గ్రీన్ ల్యాండ్స్ ఏడీఈ పరిధిలో..

మరమ్మతుల కారణంగా గ్రీన్ ల్యాండ్స్ ఏడీఈ పరిధిలోని పలు ప్రాంతాల్లో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ చరణ్ సింగ్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మున్సిపల్ మార్కెట్, బీఎస్ పురి కాలనీ ఫీడర్ల పరిధిలోని అపరాజిత కాలనీ, సాదత్ మంజిల్, ఎంసీహెచ్ మార్కెట్, గౌతమ్ పురి కాలనీ, మిడ్ల్యాండ్ బేకరీ, బీఎస్ పురి కాలనీ, నటరాజ్ నగర్, రాజీవ్ నగర్ ప్రాంతాల్లో.. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 వరకు రాజీవ్ గాంధీ సర్కిల్, కీర్తిలాల్ జ్యూవెల్లర్స్, గణేష్ నగర్ ఫీడర్ల పరిధిలోని శ్రీనివాస్ టవర్స్, అమోగ్ ప్లాజా, మైటాస్, గణేష్ నగర్, స్నేహపురి కాలనీ, మోతినగర్, బబ్బుగూడ ప్రాంతాల్లో కరెంట్ సరఫరా ఉండదని ఏడీఈ పేర్కొన్నారు.

ఎస్టీపీలను ప్రారంభానికి సిద్ధం చేయాలి

హైదరాబాద్ సిటీ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కొత్తగా నిర్మిస్తున్న ఎస్టీపీల ప్రాంగణంలో ఆహ్లాదకర వాతావరణం కోసం సుందరీకరణ పనులు చేపట్టాలని, చివరిదశలో ఉన్న ఎస్టీపీల పనులను వేగంగా పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని ఈడీ మయాంక్ మిట్టల్ అధికారులను ఆదేశించారు. నాగోల్‌లో 320 ఎంఎల్డీ సామర్థ్యంతో, వెన్నెలగడ్డలో 10 ఎంఎల్డీ సామర్థ్యంతో నిర్మిస్తున్న ఎస్టీపీలను మంగళవారం ఆయన సందర్శించారు. ఈడీ వెంట డైరెక్టర్ సుదర్శన్, సీజీఎం పద్మజ, జీఎం వాస సత్యనారాయణ, అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులు ఉన్నారు.

మానసిక ఆస్పత్రిలో రోగి మృతి

ఎర్రగడ్డ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఎర్రగడ్డ మానసిక ఆస్పత్రిలోని అవుట్ పేషెంట్ బ్లాకులో రోగి మృతిచెందాడు. కొండాపూర్ హఫీజ్‌పేటకు చెందిన 44 ఏళ్ల వ్యక్తి మంగళవారం ఔట్‌పేషెంట్ వార్డులో చూపించడానికి కుటుంబ సభ్యులు తీసుకువచ్చారు. అప్పటికే తీవ్ర అనారోగ్యానికి గురైన అతడు డాక్టర్ వద్ద బెంచ్‌పై కూర్చొనే మృతి చెందినట్లు ఆస్పత్రి సిబ్బంది తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించినట్లు వైద్యులు తెలిపారు.

ఆస్పత్రి నుంచి పారిపోయిన మరొకరు

ఎర్రగడ్డ మానసిక ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగి మంగళవారం పారిపోయాడు. కరీంనగర్ జిల్లా రాఘవపూర్‌కు చెందిన 28 ఏళ్ల రోగి ఈనెల 7న ఆస్పత్రిలో చేరి క్లోజ్డ్ మెయిల్ వార్డులో చికిత్స పొందుతున్నాడు. మానసిక స్థితి బాగోలేకపోవడంతో కోర్టు ఆర్డర్ ద్వారా అతడికి చికిత్స అందిస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం ఎక్స్‌రే పరీక్ష కోసం అవుట్ పేషెంట్ విభాగంలోని రూమ్‌కు తీసుకెళ్తుండగా తప్పించుకొని పారిపోయినట్లు ఆస్పత్రి సిబ్బంది తెలిపారు. కాగా, ఈ విషయమై పోలీసులను సంప్రదించగా ఆస్పత్రి నుంచి రోగి పారిపోయినట్లు తమకు ఎలాంటి సమాచారం అందలేదన్నారు.

భార్యాపిల్లలపై దాడి చేసిన వ్యక్తికి ఏడు రోజుల జైలు


సయ్యద్ ఖదీర్

బంజారాహిల్స్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో భార్య, పిల్లలపై దాడిచేసిన వ్యక్తికి ఏడు రోజల జైలు శిక్ష పడింది. బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 12కు చెందిన సయ్యద్ ఖదీర్, షహీన్ దంపతులకు ఐదుగురు సంతానం. ఖదీర్ రోజు మద్యం తాగి వచ్చి భార్యను కొట్టేవాడు. ఈ క్రమంలో ఈ నెల 24న మద్యం మత్తులో భార్య, కుమార్తెను తీవ్రంగా కొట్టాడు. బాధితుల ఫిర్యాదు మేరకు ఖదీర్‌ను అదుపులోకి తీసుకున్న బంజారాహిల్స్ ఎస్ఐ ప్రవీణ్ కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి జైలు శిక్ష విధించారు.

కార్డు లిమిట్ పెంచుతామంటూ రూ. 2.29 లక్షల లూటీ

హైదరాబాద్ సిటీ, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): క్రెడిట్ కార్డు లిమిట్ పెంచుతామని 53 ఏళ్ల మహిళను నమ్మించిన సైబర్ క్రిమినల్స్ కార్డులో ఉన్న రూ. 2.29లక్షలు కొల్లగొట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరానికి చెందిన మహిళకు ఓ గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ చేసి యూనియన్ బ్యాంక్ ఎగ్జిక్యూటివ్‌గా పరిచయం చేసుకున్నాడు. క్రెడిట్ కార్డు విభాగం నుంచి మాట్లాడుతున్నామని.. కార్డు లిమిట్‌ను రూ.5లక్షలకు పెంచుతున్నామ చెప్పాడు. అతడి మాటలు నమ్మిన మహిళ కార్డు వివరాలు, ఓటీపీలు చెప్పడంతో రూ. 2,29,180లు కొల్లగొట్టాడు. ఆలస్యంగా మెసేజ్‌లు చెక్ చేసుకున్న బాధితురాలు మోసపోయినట్లు గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

యూనివర్సిటీ భూమిని కాపాడాలని..


అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న జేఏసీ నేతలు

హైదరాబాద్ సిటీ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): డా.బి.ఆర్.అంబేడ్కర్ యూనివర్సిటీలో పది ఎకరాల భూమిని కాపాడాలంటూ రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్. అంబేడ్కర్ విగ్రహానికి వర్సిటీ జేఏసీ నేతలు, ఉద్యోగులు రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మంగళవారం వినతిపత్రం అందజేశారు. అంబేడ్కర్ విశ్వవిద్యాలయ స్థలం జవహర్ లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయానికి కేటాయించాలనే ప్రభుత్వ లేఖను ఉపసంహరించుకోవాలని వర్సిటీ ఐక్య కార్యాచరణ సమితి డిమాండ్ చేసింది. ఈ మేరకు వర్సిటీ పరిపాలన భవనం ముందు బైఠాయించి, నల్లబ్యాడ్జీలు ధరించి 68వ రోజు నిరసనను కొనసాగించారు. కార్యక్రమంలో ఐక్య కార్యాచరణ సమితి చైర్‌పర్సన్ ప్రొ.పల్లవీ కాబ్డే, కన్వీనర్ ప్రొ.వడ్డాణం శ్రీనివాస్, సెక్రటరీ జనరల్ డా.పి.వేణుగోపాల్ రెడ్డి, జేఏసీ నేతలు డా.ఎల్వీకే రెడ్డి, డా.రవీంద్రనాథ్ సోలమన్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవాలు


పూర్ణాహుతి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ కవిత, కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి

బంజారాహిల్స్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): బంజారాహిల్స్ రోడ్ నంబర్ 14లోని నందినగర్ అంజనేయ స్వామి ఆలయంలో జరుగుతున్న తృతీయ వార్షికోత్సవాలు మంగళవారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆలయంలో నిర్వహించిన పూర్ణాహుతి వేడుకల్లో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు ఆలయంలో స్వామివారికి నిజాభిషేకం, లక్ష తమలపాకుల అర్చన, అన్నప్రసాద వితరణ, రథోత్సవం వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వరకాలనీ డివిజన్ కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి, ఆలయ చైర్మన్ దశరథ్ చౌహాన్ తదితరులు పాల్గొన్నారు.

పనులను త్వరగా పూర్తిచేస్తాం


ప్రభుత్వ ముద్రణాలయం వద్ద పనులను పరిశీలిస్తున్న విద్యుత్, జీహెచ్‌ఎంసీ అధికారులు

ఖైరతాబాద్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతిలో మింట్ కాంపౌండ్ రహదారి తెరిచేదెప్పుడో అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి విద్యుత్ శాఖతో పాటు జీహెచ్‌ఎంసీ అధికారులు స్పందించారు. విద్యుత్ శాఖ ఎఈ నర్సింగ్‌రావు పనులను పరిశీలించి బాక్స్ డ్రెయిన్ లోపలి నుంచి విద్యుత్ కేబుళ్లు రావడం సరికాదని, వాటిని రీ లొకేట్ చేయాలని అధికారులను కోరారు. ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనంతో ప్రభుత్వ ముద్రణాలయ జేఏసీ ఆధ్వర్యంలో పనులు త్వరగా చేయాలని ధర్నాకు సిద్ధం కాగా.. విషయం తెలుసుకున్న ఇరు శాఖల అధికారులు పనులు త్వరగా పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు. జీహెచ్‌ఎంసీ ఏఈ చరణ్, ముద్రణాలయం జేఏసీ నాయకులు ఈశ్వర్ రావు, బాల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

యువకుడికి అరుదైన శస్త్రచికిత్స


యువకుడికి సర్జరీ చేస్తున్న దృశ్యం

హైదరాబాద్ సిటీ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): సన్‌షైన్ బోన్ అండ్ జాయింట్ ఇనిస్టిట్యూట్‌లోని షోల్డర్ సర్జరీ విభాగం, కిమ్స్ సన్‌షైన్ ఆస్పత్రిలో 'ఆర్థోస్కోపిక్ కార్టిలేజ్ షోల్డర్ రిపేర్' అరుదైన శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు. పాతికేళ్ల యువకుడు బాస్కెట్ బాల్ ఆడుతుండగా భుజానికి తీవ్ర గాయమైంది. బేగంపేటలోని ఆస్పత్రికి వచ్చిన అతడికి పరీక్షించిన వైద్యులు ఇటీవల ఆర్థోస్కోపిక్ కార్టిలేజ్ రిపేర్ సర్జరీ చేసినట్లు చీఫ్ షోల్డర్ సర్జన్ డాక్టర్ బి.చంద్రశేఖర్ తెలిపారు. ఈ సర్జరీని హైదరాబాద్‌లో మొట్టమొదటిసారిగా చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఆధునిక సాంకేతికతను ఉపయోగించుకొని కొండ్రో పిల్లర్ టెక్నాలజీ సాయంతో చికిత్స అందించినట్లు వివరించారు. ఎవరైనా భుజం నొప్పి, కదలికలు సరిగ్గా లేకపోవడం వంటి సమస్యలతో బాధపడుతుంటే సరైన చికిత్స తీసుకోవాలని ఆయన సూచించారు.

నటుడు సోనూసూద్‌కు రేపు పురస్కారం ప్రదానం

బంజారాహిల్స్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఏటా సుచిరిండియా ఫౌండేషన్ అందించే సంకల్ప్ కిరణ్ పురస్కారం ఈ సారి ప్రముఖ నటుడు, సామాజిక వేత్త సోనూసూద్‌కు ఇవ్వనున్నారు. సుచిరిండియా ఫౌండేషన్ సంకల్ప్ దివస్ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 28న లలిత కళాతోరణంలో జరగబోయే కార్యక్రమంలో నటుడు సోనూసూద్‌కు సంకల్ప్ కిరణ్ పురస్కారం అందజేయనున్నట్లు వ్యాపారవేత్త, సుచిరిండియా ఫౌండేషన్ అధినేత లయన్ కిరణ్ తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఆయన జూబ్లీహిల్స్‌లోని తన కార్యాలయంలో వివరాలను వెల్లడించారు.


మాలల సింహగర్జన కరపత్రాలను పంపిణీ చేస్తున్న మాలమహానాడు నేతలు

మాలల సింహగర్జనకు తరలిరండి

యూసు‌ఫ్‌గూడ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): డిసెంబరు 1న పరేడ్‌గ్రౌండ్‌లో జరిగే మాలల సింహగర్జన సభను విజయవంతం చేయాలని రాష్ట్ర మాల మహానాడు గ్రేటర్ హైదరాబాద్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కొనెల రమేష్ కోరారు. మంగళవారం రహ్మత్‌నగర్ డివిజన్ ఎస్పీఆర్‌హిల్స్ ప్రాంతంలో కరపత్రాలు పంచుతూ మాలల సింహగర్జనపై మాలలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొన్ని పార్టీలు రాజకీయ లబ్ధి కోసం దళితులను విభజించేందుకు ప్రయత్నిస్తున్నాయని మండిపడ్డారు.

శుభకార్యాల్లో డబ్బులు డిమాండ్ చేస్తున్న ట్రాన్స్‌జెండర్స్ అరెస్ట్

హైదరాబాద్ సిటీ, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): గృహప్రవేశాలు సహా నగరంలో పలు ఫంక్షన్‌లకు వెళ్లి యజమానులను ఇబ్బందులకు గురిచేయడంతో పాటు స్థానికంగా న్యూసెన్స్ క్రియేట్ చేస్తున్న ఏడుగురు ట్రాన్స్‌జెండర్స్‌ను వెస్టుజోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. జూబ్లీహిల్స్ పరిధిలోని నందగిరి హిల్స్‌లో గృహప్రవేశం జరుగుతుండగా అక్కడికి కొంతమంది ట్రాన్స్‌జెండర్స్ వచ్చి డబ్బులకోసం వేధించడంతో పాటు అశ్లీలంగా, అసభ్యంగా ప్రవర్తించి న్యూసెన్స్ క్రియేట్ చేశారు. దాంతో విశ్వసనీయ సమాచారం అందుకుంటున్న వెస్టుజోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ జంగయ్య తన టీమ్‌తో దాడిచేసి ఇబ్బందులు సృష్టిస్తున్న ఏడుగురు ట్రాన్స్‌జెండర్స్ పప్పి, కుషి చౌహాన్, మోహిని, అన్నీ, అంజలి, స్టెల్లారాయ్, సాయిపల్లవిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారిని జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

క్రీడలకు సమయం కేటాయించాలి

- విద్యార్థులకు ఎమ్మెల్యే తలసాని సూచన


క్రీడలను ప్రారంభించిన అనంతరం విద్యార్థులతో ముచ్చటిస్తున్న ఎమ్మెల్యే తలసాని

అమీర్‌పేట, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల కోసం కొంత సమయం కేటాయించాలని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ సూచించారు. మంగళవారం సనత్‌నగర్ లేబర్ వెల్ఫేర్ గ్రౌండ్‌లో మూడు రోజుల పాటు నిర్వహించనున్న స్పోర్ట్స్ మీట్‌కు ముఖ్య అతిథిగా హాజరై ప్రాంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు కేవలం చదువుకే పరిమితం కావడం వల్ల మానసిక ఒత్తిడికి గురవుతారని, కొంత సమయం క్రీడలకు కేటాయిస్తే ప్రశాంతత పొందుతారన్నారు. తల్లితండ్రులు సైతం తమ పిల్లలను ఆసక్తి ఉన్న రంగాలలో ప్రోత్సహించాలని సూచించారు. విద్యార్థులను క్రీడలలో ప్రోత్సహించే లక్ష్యంతో స్పోర్ట్స్ మీట్ నిర్వహిస్తున్న ఆర్ఎస్ఎంఏ అసోసియేషన్ ప్రతినిధులను తలసాని అభినందించారు. గుర్తింపు పొందిన పాఠశాలల యాజమాన్యాలకు తన సహకారం ఎప్పుడూ ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కొలన్ బాల్‌రెడ్డి, ఆర్ఎస్ఎంఏ అధ్యక్షుడు అగస్టీన్, ప్రధాన కార్యదర్శి సుధాకర్ రెడ్డి, ఉమామహేశ్వర రావు, ఎంఎస్ ప్రసాద్, ప్రశాంత్, కుతుబద్దీన్, సీత పాల్గొన్నారు.


వీర హనుమాన్ సాయిబాబా దేవాలయంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహిస్తున్న భక్తులు

హనుమాన్ ఆలయంలో సత్యనారాయణ వ్రతం

ఎర్రగడ్డ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహిస్తే ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు సిద్ధిస్తాయని వీర హనుమాన్, షిరిడీ సాయిబాబా దేవాలయ ముఖ్య సలహాదారు మేడూరు ప్రసాద్‌రావు అన్నారు. బీకేగూడ దాసారం బస్తీలోని దేవాలయంలో మంగళవారం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సత్యనారాయణ స్వామి వ్రతం చేసినా, చూసినా శుభం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పి.ఆగమయ్య, పి.సురేష్, ప్రసాదం విశ్వనాథ శాస్త్రి, శ్రావణ్‌కుమార్ శర్మ, రమేష్, కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.


టీటీడీ చైర్మన్‌గా నియమితులైన బీఆర్ నాయుడును ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.
– బంజారాహిల్స్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి)

ప్రజావాణికి 574 దరఖాస్తులు


అర్జీదారులతో మాట్లాడుతున్న ప్రజావాణి నోడల్ అధికారి దివ్య దేవరాజన్

బేగంపేట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మహాత్మా జ్యోతిబాఫూలే ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన ప్రజావాణికి మొత్తం 574 దరఖాస్తులు వచ్చాయి. రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు, ప్రజావాణి ఇన్‌చార్జి, ప్రజావాణి నోడల్ అధికారి దివ్య దేవరాజన్‌ప్రజల నుంచి అర్జీలు తీసుకోవడంతో పాటు వారి సమస్యలను తెలుసుకున్నారు. స్వయంగా దరఖాస్తుదారుల సమస్యలు తెలుసుకోవడంతో పాటు వాటి పరిష్కారానికి కృషి చేస్తామని ఈ సందర్భంగా వారికి భరోసా ఇచ్చారు. మైనార్టీ వేల్ఫేర్‌శాఖకు 198, విద్యుత్ శాఖకు 99, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు 98, రెవెన్యూకు 55, విద్యాశాఖకు 26, ప్రవాసీ ప్రజావాణికి 4, ఇతర శాఖలకు సంబంధించి 94 దరఖాస్తులు అందినట్లు ప్రజావాణి అధికారులు తెలిపారు.

నకిలీ డిప్యూటీ కలెక్టర్‌పై కేసు నమోదు

అమీర్‌పేట, నవంబరు26 (ఆంధ్రజ్యోతి): విదేశాల్లో ఉద్యోగాల కోసం వీసాలిప్పిస్తానని నమ్మించి అమీర్‌పేటలోని ఓ కన్సల్టెన్సీ నుంచి రూ.12.5 లక్షల వరకు వసూలు చేసిన నకిలీ డిప్యూటీ కలెక్టర్‌పై కేసు నమోదైంది. ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్ రెడ్డి వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా నల్లగండ్లకు చెందిన దండా చంద్రబాబు అమీర్‌పేట ధరంకరం రోడ్డులో మన్నెం సర్వీసెస్ పేరిట ఓవర్సీస్ కన్సల్టెన్సీని నిర్వహిస్తున్నాడు. ఇటీవల చింత సురేష్ అనే వ్యక్తి తాను విశాఖపట్నం డిప్యూటీ కలెక్టర్‌నంటూ పరిచయం చేసుకుని తాను వర్క్ వీసాలను ఇప్పిస్తానని నమ్మించాడు. దీంతో కన్సల్టెన్సీ నిర్వాహకుడు చంద్రబాబు వద్ద రూ.8.5 లక్షలు, మరో రెండు సార్లు రూ.2లక్షల చొప్పున వసూలు చేశాడు. మరింత డబ్బు కోసం డిమాండ్ చేస్తుండటంతో అనుమానం వచ్చిన చంద్రబాబు ఎస్ఆర్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఆహార భద్రతలో గోధుమ మిల్లింగ్ రంగం కీలకం

బేగంపేట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఆహార భద్రతలో గోధుమ మిల్లింగ్ రంగం కీలకమని పలువురు నిపుణులు పేర్కొన్నారు. వీట్ ప్రొగ్రెస్ ప్రమోషన్ సొసైటీ (డబ్ల్యూపీపీఎస్) ఆధ్వర్యంలో బేగంపేటలోని తాజ్‌వివంతా హోటల్‌లో మంగళవారం జరిగిన సదస్సులో వంద మందికి పైగా గోధుమ పరిశ్రమ రంగ నిపుణులు, ఉత్పత్తిదారులు హాజరై పలు అంశాలపై చర్చించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ ఆహార భద్రత కమిషనర్, ఐఏఎస్ అధికారి ఆర్వీ కర్ణన్ మాట్లాడుతూ.. ప్రపంచ ఆహార భద్రత అవసరాలను తీర్చడంలో ఏకీకృత విధానం రావాలన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు పౌరులు సహకరించాలి

- ఏసీపీ వెంకటరమణ

అమీర్‌పేట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులకు పౌరుల సహకారం అవసరమని ఎస్ఆర్‌నగర్ ఏసీపీ వెంకటరమణ అన్నారు. ఇటీవల నగరంలోని పలు ప్రార్థనాలయాలపై దాడుల నేపథ్యంలో పౌరులతో పాటు శాంతి, సంక్షేమ సంఘాల సభ్యులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మంగళవారం సాయంత్రం ఎస్ఆర్‌నగర్, బోరబండ పోలీస్ స్టేషన్ల పరిధిలోని శాంతి సంఘం, సంక్షేమ సంఘాలు, ప్రార్థనాలయాల నిర్వాహకులతో ఎస్ఆర్‌నగర్‌లో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఆర్టీఓ అధికారులతో ఎమ్మెల్యే శ్రీగణేష్

ఆధునిక హంగులతో ఆర్టీఓ కార్యాలయం

కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్

తిరుమలగిరి నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): తిరుమలగిరి ఆర్టీఓ కార్యాలయాన్ని రాష్ట్రంలోనే ఆధునిక హంగులతో నిర్మిస్తామని ఎమ్మెల్యే శ్రీగణేష్ అన్నారు. మంగలవారం ఎమ్మెల్యే తిరుమలగిరిలోని ఆర్టీఓ కార్యాలయాన్ని సందర్శించారు. ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణంలో భాగంగా ఆర్టీఓ కార్యాలయం సుమారు 75 శాతం భవనం కోల్పోతుందన్నారు. ఆర్టీఓ కార్యాలయ స్థలం 3ఎకారాలు ఉన్న నేపథ్యంలో ఆధునిక హంగులతో నిర్మించి పౌరులకు అన్ని సదుపాయాలు కల్పిస్తామని ఆయన వెల్లడించారు. రాష్ట్రంలోనే రోల్ మోడల్‌గా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు సిద్ధంచేయాలని అధికారులకు సూచించారు. కార్యాలయం ఇన్‌చార్జి ఆర్టీఓ స్వామి, మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ జయ్‌చందర్, నరసింహ స్వామి, అవినాష్, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇప్పించండి

అడ్డగుట్ట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): అర్హులైన లబ్ధిదారులకు డబుల్‌బెడ్‌రూంలు అందజేస్తామని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ మహిళలకు హామీ ఇచ్చారు. మంగళవారం తుకారాంగేట్‌లోని ఎమ్మెల్యే నివాసంలో ఎమ్మెల్యేను కలిసి కంటోన్మెంట్‌లోని పలు ప్రాంతాలకు చెందిన మహిళలు వినతి పత్రం సమర్పించారు. ఈ నియోజకవర్గంలో చాలామంది ఇళ్లలేని వారు ఉన్నారన్నారు. ఇళ్లులేని వారికి న్యాయం చేసేందుకు కృషిచేస్తానని ఎమ్మెల్యే మహిళలకు హామీ ఇచ్చారు.

● రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్మన్‌కు సన్మానం



తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్మన్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ వెన్నల గద్దర్‌ను అంబేడ్కర్ యువజన సంఘం, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు యాదయ్య మంగళవారం ఆమెను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సీఎల్ యాదగిరి, జి.రాజయ్య, సురేష్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

- తిరుమలగిరి నవంబరు 26 (ఆంధ్రజ్యోతి)



ర్యాలీ చేస్తున్న క్రిస్టియన్లు

క్రిస్టియన్ డే గా ప్రకటించాలి : యోహాన్

రెజిమెంటల్‌బజార్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నవంబర్ 26వ తేదీని క్రిస్టియన్ డే గా ప్రకటించాలని క్రైస్తవ సంక్షేమ సంఘం జాతీయ నాయకుడు పీవీ యోహాన్ డిమాండ్ చేశారు. మంగళవారం ప్రపంచ క్రైస్తవుల దినోత్సవం సందర్భంగా సికింద్రాబాద్‌లో ప్రత్యేక ప్రార్థనలు చేసి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఎస్ఐ డి.నామినేషన్ మెదక్ డయాసిస్ మాజీ ట్రెజరర్ డానియల్, జెరుషలేం మత్తయ్య, విలియం, చింతల ఏసన్న, ఇజ్రాయిల్, పాస్టర్ పాల్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.



దివ్యాంగులను తిరుపతి దైవదర్శనానికి తీసుకెళుతున్న చుక్కాల చారిటబుల్ ట్రస్ట్

దివ్యాంగులకు తిరుపతి దైవదర్శనం

చుక్కాల చారిటబుల్ ట్రస్ట్ చేయూత

సికింద్రాబాద్‌రైల్వే స్టేషన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): తిరుపతి దైవదర్శనం చేసుకోలేని వారికి చుక్కాల చారిటేబుల్ ట్రస్ట్ ఫౌండేషన్ చేయుతనిందిస్తోంది. ఫౌండేషన్ ప్రతినిధి డాక్టర్ వేణు నగర వ్యాపితంగా 400 మంది దివ్యాంగులు, వృద్ధులను మంశవారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి రెండు ప్రత్యేక రైళ్లలో సొంత ఖర్చులతో తిరుపతికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1996లో ఒక్కన్నే తిరుపతికి వెళ్లేవాడినని, అనంతరం స్నేహితులు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులను తీసుకెళ్లేవాడినని అన్నారు. వెంకటేశ్వరస్వామి కృపమేరకు స్తోమత లేని నిరుపేదలు, దివ్యాంగులను తిరుపతి దర్శనం చేయిస్తున్నానని తెలిపారు. ప్రతి ఏడాది ప్రత్యేక రైలులో తిరుపతి దైవదర్శనానికి తీసుకెళుతున్నాన్నారు.

బంగారు ఆభరణాల చోరీ.. నిందితురాలి అరెస్టు

73 గ్రాముల నెక్లెస్ స్వాధీనం

హైదర్‌నగర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): బంగారం షాపులో సేల్స్‌మన్ కన్నుగప్పి ఆభరణాలు చోరీ చేసిన కేసులో నిందితురాలిని కేపీహెచ్‌బీ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. కూకట్‌పల్లిజోన్ ఏసీపీ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం... మియాపూర్‌లోని గోకుల్‌టవర్స్‌కు చెందిన పుట్టా సునీత(41) ఈనెల 23న కేపీహెచ్‌బీకాలనీ రోడ్ నంబర్-1 లోని దేవిజువెల్లర్స్ షాప్‌నకు నగలు కోసేందుకు వచ్చింది. ముఖానికి మాస్క్ ధరించి నగలు చూపించాల్సిందిగా సేల్స్‌మన్‌ను కోరింది. నగలు చూపిస్తుండగా అతని దృష్టి మరల్చి బంగారు నగలు దొంగిలించి, అక్కడ మోడల్స్ నచ్చలేదంటూ అక్కడి నుంచి వెళ్లిపోయింది. తర్వాత నగలు పోయినట్లుగా గుర్తించిన షాప్ యజమాని కేపీహెచ్‌బీ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు సీసీపుటేజ్ ఆధారంగా చోరీకిపాల్పడ్డ సునీత పాతనేరస్తురాలిగా గుర్తించి దర్యాప్తు చేపట్టారు. ఏసీపీ శ్రీనివాస్‌రావు ప్రత్యేకశ్రద్ధ తీసుకుని డీఐ రవికుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి పుట్టా సునీతను మంగళవారం అరెస్టు చేశారు. ఆమె నుంచి రూ.2,90,000 విలువైన 73 గ్రాముల బంగారు నెక్లెస్‌ను స్వాధీనం చేసుకుని ఆమెను రిమాండ్‌కు తరలించారు.

క్రీడా మైదానంలో మురుగునీరు



కమ్యూనిటీ హాల్ మ్యాన్‌హోళ్ల నుంచి లీకవుతున్న మురుగునీరు



గ్రౌండ్‌లో పారుతున్న మురుగునీరు

నెహ్రూనగర్ జీహెచ్‌ఎంసీ గ్రౌండ్‌లో అపరిశుభ్రత



మురికి కూపంగా మైదానం

మారేడుపల్లి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మోండా డివిజన్ పరిధిలో నెహ్రూనగర్ పార్క్ ఆవరణలోని క్రీడా మైదానంలో మురుగునీరు ఏరులై పారుతోంది. పక్కనే ఉన్న జీహెచ్‌ఎంసీ కమ్యూనిటీ హాల్‌కు సంబంధించిన డ్రైనేజీ పైపులైన్లను క్రీడామైదానంలో నుంచి ఏర్పాటుచేశారు. కమ్యూనిటీహాల్‌లో తరచూ శుభకార్యాలు, సభలు, సమావేశాలు జరుగుతుంటాయి. ఈ క్రమంలో డ్రైనేజీలో చెత్తాచెదారం, వ్యర్థ పదార్థాలు వేయడంతో మ్యాన్‌హోల్ నుంచి మురుగునీరు క్రీడా మైదానంలో తరచూ ఏరులై పారుతోంది. దీంతో క్రీడామైదానం సగం మేర మురుగునీరు, అపరిశుభ్రంగా మారి, ఈ ప్రాంతమంతా దుర్వాసన వస్తోంది. దీంతో క్రీడామైదానంలో ఉదయం, సాయంత్రం సమయాల్లో వాలీబాల్, బాక్సింగ్, కరాటే, వ్యాయామం, శిక్షణ కోసం వచ్చే యువకులు, క్రీడాకారులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అదే విధంగా మారేడుపల్లి చుట్టూ పరిసర ప్రాంతాల్లో ఉన్న ప్రైవేట్ స్కూళ్లకు చెందిన విద్యార్థులకు ఇదే మైదానం అనుకూలంగా ఉంటుంది. దీంతో వందలాదిమంది విద్యార్థులు ఇక్కడ క్రీడలు ఆడుతారు. ఇలాంటి ప్రాధాన్యత కలిగిన నెహ్రూనగర్ వాలీబాల్ మైదానం అపరిశుభ్రతకు నిలయంగా, మానసిక ఉల్లాసానికి ఆటంకంగా తయారయ్యింది. ఆట స్థలంపై అధికారుల పర్యవేక్షణ, నిర్వహణ లేకపోవడమే ఇందుకు కారణం. జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారుల నిర్లక్ష్యం కారణంగా క్రీడామైదానం పరిస్థితి అధ్వాన్నంగా మారిందని క్రీడాకారులు, వారి తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. క్రీడామైదానాన్ని మరింతగా అభివృద్ధి చేసి, డ్రైనేజీ మురుగునీటిని అరికట్టాలని కోరుతున్నారు.

పేదలకు అండగా ఉంటాం: ఎమ్మెల్యే పద్మారావుగౌడ్



కాంగ్రెస్ నాయకులతో కలిసి లబ్ధిదారుకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

బౌద్ధనగర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ నియోజకవర్గ ప్రజలకు అండగా ఉంటామని ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావుగౌడ్ అన్నారు. మంగళవారం మధురానగర్ కమ్యూనిటీ హాల్‌లో ముషీరాబాద్, మారేడుపల్లి మండలాల పరిధుల్లో 1.98కోట్ల విలువచేసే 198 షాదీముబారక్, కల్యాణలక్ష్మి చెక్కులను లబ్ధిదారులకు కార్పొరేటర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదప్రజల ఇబ్బందులను నివారించేందుకు ఈ పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. గత ఎన్నికల హయాంలో ఇచ్చిన హామీలను ప్రస్తుత ప్రభుత్వం అమలు జరపాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సామల హేమ, సునీత, ప్రసన్నలక్ష్మి, మాజీ కార్పొరేటర్ కందినారాయణ, యువనాయకుడు హరి, సునీల్, కాంగ్రెస్ నాయకులు జలంధర్‌రెడ్డి, షకీల్‌ఖాన్, వాహీదుద్దీన్, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులపై ఆగ్రహం

అధికారులు ప్రోటోకాల్ నిబంధనలు ఉల్లఘించి ప్రవర్తిస్తున్నారని సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావుగౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రవర్తన మార్చుకోని అధికారులపై స్పీకర్‌కు ఫిర్యాదు చేస్తామని అన్నారు. ఇక నుంచి అన్ని చెక్కుల పంపిణీ కార్యక్రమాలను ఎమ్మెల్యే కార్యాలయంలో లేదా సీతాఫల్‌మండి జీహెచ్‌ఎంసీ కమ్యూనిటీహాల్‌లో ఏర్పాటుచేయాలని అధికారులకు సూచించారు.

పంపిణీలో కాంగ్రెస్ నాయకుల నినాదాలు

చెక్కుల పంపిణీ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నినాదాలు చేశారు. ప్రతిగా బీఆర్ఎస్ నాయకులు నినాదాలు చేశారు. దీంతో ఎమ్మెల్యే పద్మారావుగౌడ్, కాంగ్రెస్ నాయకులతో లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. తులం బంగారం ఏదీ అని లబ్ధిదారులు ప్రశ్నించగా వీళ్లను అడగండి అని కాంగ్రెస్ నాయకులను చూపించారు. ఎటువంటి సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఎస్ఏ పోస్టులను డైరెక్ట్‌గా భర్తీచేయాలి



ధర్నాకు మద్దతు తెలుపుతున్న మాజీ ఎంపీ ఆర్.కృష్ణయ్య, వెంకటేష్ తదితరులు

కవాడిగూడ, నవంబరు 26 (ఆంధ్ర జ్యోతి): స్కూల్ అసిస్టెంట్ (ఎస్ఏ) పోస్టులను డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారానే భర్తీచేయాలని ఎస్‌జీటీ టీచర్లకు ఇచ్చే 70శాతం ప్రమోషన్లను పూర్తిగా తొలగించాలని మాజీ ఎంపీ, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీఈడీ నిరుద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని మంగళవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో తెలంగాణ రాష్ట్ర బీఈడీ నిరుద్యోగ అభ్యర్థుల సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఆర్.కృష్ణయ్య నిరుద్యోగులకు సంపూర్ణ మద్దతు ప్రకటించి ధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డీఈడీ చేసిన వారికి వందశాతం డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా ఎస్‌జీటీ ఉద్యోగాలను భర్తీ చేస్తున్నారో.. అలానే స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగాలను కూడా బీఈడీ అభ్యర్థులతో మాత్రమే భర్తీచేయాలని డిమాండ్ చేశారు. జీవో 108 ప్రకారం స్కూల్ అసిస్టెంట్ పోస్టులను 70 శాతం ప్రమోషన్లతో భర్తీ చేస్తే.. బీఈడీ నిరుద్యోగ అభ్యర్థుల భవిష్యత్ ఏమిటని ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ ధర్నాలో నిరుద్యోగ జేఏసీ చైర్మన్ నీల వెంకటేష్, నాయకులు కల్యాణ్‌నాయక్, నరేష్, బీఈడీ అభ్యర్థుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూక్యానాయక్, అశోక్, నందగోపాల్, పి.సుధాకర్, రంజిత్, శంకర్‌తోపాటు బీఈడీ అభ్యర్థులు పాల్గొన్నారు.

అన్నదమ్ముల వక్రమార్గం

- డబ్బు కోసం గంజాయి సరఫరా
- 18 కిలోల పట్టివేత
- సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో ఇద్దరి అరెస్టు
- వెస్ట్ బెంగాల్ టు మహారాష్ట్రకు గంజాయి సరఫరా



గంజాయి నిందితులను అరెస్టు చూపుతున్న జీఆర్‌పీ పోలీసులు

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో జీఆర్‌పీ పోలీసులు ఆకస్మిక తనిఖీలు చేస్తుండగా రూ.4.50 లక్షల విలువ చేసే 18 కిలోల గంజాయి సరుకును స్వాధీనం చేసుకన్నారు. సికింద్రాబాద్ రైల్వే డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రైల్వే డీఎస్పీ జావెద్, సికింద్రాబాద్ రైల్వే ఇన్‌స్పెక్టర్ సాయి ఈశ్వర్‌గౌడ్ వివరాలను వెల్లడించారు. వెస్ట్ బెంగాల్ హొగ్గీ మండలం రత్‌టాలా గ్రామానికి చెందిన ప్రీతంచౌదరీ(37), సత్యంచౌదరీ(29) ఇద్దరూ అన్నదమ్ములు. సులువుగా డబ్బు సంపాదించుకునేందుకు గంజాయి సరుకును విక్రయించాలని అనుకున్నారు. ఈ సోమవారం వెస్ట్‌బెంగాల్‌లోని శాలిమార్ టౌన్‌లో 18 కిలోల గంజాయి సరుకును కొనుగోలు చేశారు. ముంబైలో అమ్మడానికి రైలులో గంజాయి బ్యాగులతో బయలుదేరారు. మంగళవారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో జీఆర్‌పీ సీఐ సాయి ఈశ్వర్‌గౌడ్, ఎస్సై మాజీద్, రమేష్‌తో పాటు కానిస్టేబుళ్లు ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నారు. ప్లాట్‌ఫాం నంబరు2లో ఆగి ఉన్న ముంబై ఎక్స్‌ప్రెస్‌లో లగేజీలను తనిఖీచేశారు. పక్కనే ఉన్న ఇద్దరు అన్నదమ్ములను పోలీసులు అదుపులోకి తీసుకుని గంజాయి స్వాధీనం చేసుకున్నారు. వెస్ట్ బెంగాల్ గంజాయి సరుకును కొనుగోలుచేసి ఒక్కొక్క ప్యాకెట్ చొప్పున రూ.18 వేలకు మహారాష్ట్రలో విక్రయిస్తున్నట్లు విచారణలో వెల్లడైంది. దీంతో అన్నదమ్ములను అరెస్టు చేసి వారి నుంచి గంజాయి పొడి సరుకును స్వాధీనం చేసుకన్నారు. రైల్వే ఎస్పీ చందనదీప్తి ఆదేశాల మేరకు ప్రతి రోజూ రైల్వే స్టేషన్‌లో తనిఖీలు చేస్తున్నామని జీఆర్‌పీ సీఐ తెలిపారు.

ఘనంగా భారత రాజ్యాంగ దినోత్సవం



అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న డాక్టర్ రజనీప్రియ, ముఖ్య అతిథులు



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న టీడీపీ ఇన్‌చార్జి శ్రీనివాస్‌కుమార్ తదితరులు

బౌద్ధనగర్ నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండిలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద మంగళవారం రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. టీడీపీ సికింద్రాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వల్లారపు శ్రీనివాస్‌కుమార్, బీజేపీ సీతాఫల్‌మండి డివిజన్ అధ్యక్షుడు అంబాల రాజేశ్వరరావు, దళిత బహుజన ఫ్రంట్(డీబీఎఫ్) రాష్ట్ర కార్యదర్శి పులి కల్పన, ఎస్సీ, ఎస్టీ సంఘం నాయకులు విద్యాసాగర్, జీవీ కృష్ణ, చంద్రశేఖర్, భాస్కరగిరి, గడ్డం ప్రసాద్, బాచి, శివప్రసాద్ తదితరులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

కంటోన్మెంట్‌లో ...

మారేడుపల్లి: రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందని అంబేడ్కర్ వాది, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎస్సీ ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపక సభ్యులు, విశ్రాంత అధికారి జేబీ.రత్నం అన్నారు. మంగళవారం రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని పికెట్ మారేడుపల్లిలోని కంటోన్మెంట్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని విశ్వరత్న డాక్టర్ బీఆర్. అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 సంవత్సరాలు పూర్తి కావస్తున్న సందర్భంగా కేంద్ర ప్రభుత్వం జాతీయ స్థాయిలో గణతంత్ర అమృత మహోత్సవాన్ని నిర్వహించాలని నిర్ణయించిందన్నారు. ఈ సందర్భంగా సంవత్సర కాలంపాటు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల్లో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించాలని చెప్పిందన్నారు. రాజ్యాంగంలోని పీఠిక ప్రతి పౌరుడికీ సమాన హక్కులను కల్పించిందని ఆయన స్పష్టం చేశారు. రాజ్యాంగంలో ఉన్న హక్కులను కాపాడడానికి యువతరం ముందుకు రావాలని, రాజ్యాంగంలోని హక్కులు, అధికారాలు, బాధ్యతలను తెలుసుకొని పాటించాలని జేబీ మునిరత్నం కోరారు. సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్లో డిసెంబర్ 1న మాల ఉపకులాల అధ్వర్యంలో నిర్వహించే సింహగర్జన సభకు కంటోన్మెంట్ వాసులను భారీ ఎత్తున తరలించడానికి ప్రతి ఒక్కరూ కృషిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కేడీ.రమేష్, సంకి రవీందర్‌బాబు, సదానంద్, నర్సింగరావు, సతీష్‌కుమార్, లెస్లీ, శ్యాంకుమార్, అరుణ్‌కుమార్, అడ్వకేట్ రాజు, సాయికుమార్, రామ్మోహన్, రాజగోపాల్, లక్ష్మణ్, హనుమంతరావు, నరేష్, అడ్వకేట్ భూమి నరసింహ, సిద్ధు తదితరులు ఉన్నారు.



అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దళిత బహుజన ఫ్రంట్ మహిళలు, బీజేపీ నాయకులు



ఐడీహెచ్ కాలనీలో అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు నివాళులర్పిస్తున్న కాలనీ నాయకులు



డాక్టర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న జేబీ.రత్నం, సంకి రవీందర్ తదితరులు

క్రెడిట్ కార్డు లిమిట్ పెంచుతామంటూ రూ. 2.29 లక్షలు కాజేశారు

హైదరాబాద్ సిటీ, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): క్రెడిట్ కార్డు లిమిట్ పెంచుతామని 53 ఏళ్ల మహిళను నమ్మించిన సైబర్ క్రిమినల్స్ కార్డులో ఉన్న రూ. 2.29లక్షలు కొల్లగొట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరానికి చెందిన మహిళకు ఓ గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ చేసి యూనియన్ బ్యాంక్ ఎగ్జిక్యూటివ్‌గా పరిచయం చేసుకున్నాడు. క్రెడిట్ కార్డు విభాగం నుంచి మాట్లాడుతున్నామని.. కార్డు లిమిట్‌ను రూ.5లక్షలకు పెంచుతున్నామ చెప్పాడు. అతడి మాటలు నమ్మిన మహిళ కార్డు వివరాలు, ఓటీపీలు చెప్పడంతో రూ. 2,29,180లు కొల్లగొట్టాడు. ఆలస్యంగా మెసేజ్‌లు చెక్ చేసుకున్న బాధితురాలు మోసపోయినట్లు గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

నకిలీ డిప్యూటీ కలెక్టర్‌పై కేసు నమోదు

అమీర్‌పేట, నవంబరు26 (ఆంధ్రజ్యోతి): విదేశాల్లో ఉద్యోగాల కోసం వీసాలిప్పిస్తానని నమ్మించి అమీర్‌పేటలోని ఓ కన్సల్టెన్సీ నుంచి రూ.12.5 లక్షల వరకు వసూలు చేసిన నకిలీ డిప్యూటీ కలెక్టర్‌పై కేసు నమోదైంది. ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా నల్లగండ్లకు చెందిన దండా చంద్రబాబు అమీర్‌పేట ధరంకరం రోడ్డులో మన్నెం సర్వీసెస్ పేరిట ఓవర్సీస్ కన్సల్టెన్సీని నిర్వహిస్తున్నాడు. ఇటీవల చింత సురేష్ అనే వ్యక్తి తాను విశాఖపట్నం డిప్యూటీ కలెక్టర్‌నంటూ పరిచయం చేసుకుని తాను వర్క్ వీసాలను ఇప్పిస్తానని నమ్మించాడు. దీంతో కన్సల్టెన్సీ నిర్వాహకుడు చంద్రబాబు వద్ద రూ.8.5 లక్షలు, మరో రెండు సార్లు రూ.2లక్షల చొప్పున వసూలు చేశాడు. మరింత డబ్బు కోసం డిమాండ్ చేస్తుండటంతో అనుమానం వచ్చిన చంద్రబాబు ఎస్ఆర్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

మానసిక ఆస్పత్రిలో రోగి మృతి

ఎర్రగడ్డ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఎర్రగడ్డ మానసిక ఆస్పత్రిలోని అవుట్ పేషెంట్ బ్లాకులో రోగి మృతిచెందాడు. కొండాపూర్ హఫీజ్‌పేటకు చెందిన 44 ఏళ్ల వ్యక్తి మంగళవారం ఔట్‌పేషెంట్ వార్డులో చూపించడానికి కుటుంబ సభ్యులు తీసుకువచ్చారు. అప్పటికే తీవ్ర అనారోగ్యానికి గురైన అతడు డాక్టర్ వద్ద బెంచ్‌పై కూర్చొనే మృతి చెందినట్లు ఆస్పత్రిసిబ్బంది తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియాకు తరలించినట్లు వైద్యులు తెలిపారు.

ఆస్పత్రి నుంచి పారిపోయిన మరొకరు..

ఎర్రగడ్డ మానసిక ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగి మంగళవారం పారిపోయాడు. కరీంనగర్ జిల్లా రాఘవపూర్‌కు చెందిన 28 ఏళ్ల రోగి ఈనెల 7న ఆస్పత్రిలో చేరి క్లోజ్డ్ మెయిల్ వార్డులో చికిత్స పొందుతున్నాడు. మానసిక స్థితి బాగోలేకపోవడంతో కోర్టు ఆర్డర్ ద్వారా అతడికి చికిత్స అందిస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం ఎక్స్‌రే పరీక్ష కోసం అవుట్ పేషెంట్ విభాగంలోని రూమ్‌కు తీసుకెళ్తుండగా తప్పించుకొని పారిపోయినట్లు ఆస్పత్రి సిబ్బంది తెలిపారు. కాగా, ఈ విషయమై పోలీసులను సంప్రదించగా ఆస్పత్రి నుంచి రోగి పారిపోయినట్లు తమకు ఎలాంటి సమాచారం అందలేదన్నారు.